క్లుప్తంగా

ఆల్లూర్తిలో పేదలకు వస్త్రాల పంపిణీ



వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ ఖాదర్‌బాషా

పొదలకూరు : మండలంలోని ఆల్లూర్తి గ్రామానికి చెందిన పలువురు ముస్లింలకు రంజాన్ సందర్భంగా సోమవారం పంచాయతీ ఉప సర్పంచ్ ఖాదర్‌బాషా వస్త్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రెండు పండగలు ముఖ్యమని ఒకటి బక్రీద్, రెండోది రంజాన్‌గా పేర్కొన్నారు. పండగకు వారం రోజులు ముందుగానే వస్త్రాలను అందజేశామన్నారు.

మైపాడులో నగదు చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై

ఇందుకూరుపేట: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నగదు చోరీ చేసిన ఘటన మండలంలోని మైపాడులో జరిగింది. బాధితుల కథనం మేరకు.. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యురాలు అంకమ్మ భర్త వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సుమారు రూ.లక్ష నగదును కప్‌బోర్డులో ఉంచాడు. బయటకు వెళ్లి ఓ గంటన్నర తర్వాత తిరిగి ఇంటికి చేరుకున్నాడు. నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

క్షయవ్యాధిపై అవగాహన



విడవలూరు: మాట్లాడుతున్న చక్రపాణి

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎన్.మధు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జువాలజీ లెక్చరర్ ఐఎస్ చక్రపాణి మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేఆర్ షణ్ముగం, వి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వరమే పరిష్కారం



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్

మనుబోలు: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. సోమవారం ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై అందే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎంపీడీఓ జలజాక్షి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమిలో కుమ్ములాట

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం కూటమిలో కుమ్ములాట ప్రారంభమైంది. ఆదివారం టీడీపీలో ఇతర పార్టీల నాయకులను చేర్చుకునే కార్యక్రమంలో ఇది వెలుగు చూసింది. టీడీపీ నేతలు బీజేపీ, జనసేన నేతల్ని స్టేజీపైకి ఆహ్వానించకపోవడంతో వారు సభ ప్రారంభానికి ముందే వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. అదే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం అధికార పార్టీ నాయకులకు ప్రాధాన్యం లేకుండా ఇతర పార్టీల నాయకులు సభను నిర్వహించారు. సాధారణంగా కార్యక్రమాలను ఆ పార్టీకి చెందిన స్థానిక అధ్యక్షుడు నేతృత్వం వహించడం పరిపాటి. కానీ ఈ సభలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ఎంపీ శేషయ్య ఊసే లేకపోవడం స్థానికంగా చర్చకు దారి తీసింది. అదే క్రమంలో ఇతర నాయకులను కూడా విస్మరించినట్లు విమర్శలు వచ్చాయి. సూరా శ్రీనివాసులురెడ్డి, అతని అనుచరులు హాజరుకాకపోవడాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆ వర్గం ఆగ్రహంతో ఉంది. స్థానిక నాయకులకు బాధ్యతలు అప్పగిస్తామని చెబుతున్న ఎమ్మెల్యే విడవలూరు నుంచి వచ్చిన నేతకు అవకాశం ఇవ్వడంపై కొందరు గుర్రుగా ఉన్నారు. ఇప్పటికే మండలంలో నాలుగు గ్రూపులుండగా మరో గ్రూపు సిద్ధమైనట్లు తెలిసింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల విజయవాడలో ఇద్దరు అగ్రనేతల మధ్య చిచ్చు బహిర్గతమైన నేపథ్యంలో ఆదివారం రాత్రి జరిగిన సభలో కూడా ఇతర మండలాలకు చెందిన వారే అజమాయిషీ చేశారన్న ఆక్రోశం స్థానిక నాయకుల్లో వ్యక్తమవుతుంది.

రైతుల్ని ముంచిన కూటమి ప్రభుత్వం

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య



కొడవలూరు: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

కొడవలూరు: కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంగయ్య అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం, గండవరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆ సంఘ సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నేతలు రైతులను ఆదుకుంటున్నామని, 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ఇస్తున్నామని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో 18 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి వస్తే కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 40 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలోనూ తాము సందర్శించిన రెండు కేంద్రాలు వెలవెలబోతున్నాయని చెప్పారు. దీనిని బట్టి చూస్తే పేరుకే కొనుగోలు కేంద్రాలున్నాయని అర్థమవుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు రబీ సీజన్‌కు సంబంధించి రూ.500 కోట్లు నష్టపోయారన్నారు. ప్రభుత్వ పెద్దలు వెంటనే స్పందించి క్వింటాకు రూ.500లు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీరాములు, జిల్లా నాయకుడు సీహెచ్ రాజగోపాల్, సభ్యులు గోనె దయాకర్, టి.నరసింహం, దేవానంద్ పాల్గొన్నారు.

- **కోవూరు:** రైతు సంఘం నాయకులు సోమవారం కోవూరులోని రైతు సేవా కేంద్రం, కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. స్థానిక రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మిల్లర్లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మూలి వెంగయ్య, రాజగోపాల్, బాబు, రైతు నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో దగా

బుచ్చిరెడ్డిపాళెం: ధాన్యం కొనుగోళ్ల కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య అన్నారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ధాన్యం సేకరణ కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం వారు స్థానిక వవ్వేరు సహకార సంఘం వద్ద విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు చూపిన ఉత్సాహం కేవలం డ్రామాను తలపిస్తోందన్నారు. వాటిల్లో సకాలంలో గోనె సంచులు సరఫరా చేయకపోవడం, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మద్దతు ధర కన్నా రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు తగ్గింపుతో పుట్టి ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు కూడా లేకపోవడంతో వారు నష్టపోతున్నారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం దళారులను కాపాడేందుకు ప్రయత్నిస్తూ.. రైతుల్ని నట్టేట ముంచిందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం మండలంలో సుమారు 9 ఎకరాల్లో వరి సాగు సాగిందని తెలిపారు. 27 వేల టన్నులు ధాన్యం పండిందని కానీ కొనుగోలు కేంద్రాల ద్వారా 3,200 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, రైతులు మిల్లర్లకు అమ్ముకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గండవరపు శ్రీనివాసులు, బిళ్ల రఘురామయ్య, షేక్ జానీబాషా, గరికపాటి సురేష్, చల్లకొలుసు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



కోవూరు: మాట్లాడుతున్న రైతు సఘం నాయకులు



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బిడ్డలు పట్టించుకోకపోయినా..

- మేమున్నామంటూ అండగా నిలిచి..



మృతదేహాన్ని తరలిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కోవూరు: తండ్రి చనిపోయాడని చెప్పినా కన్నబిడ్డలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సహచర డాక్యుమెంట్ రైటర్లు దగ్గరుండి అంత్యక్రియలు చేశారు. వివరాలు.. పోశిన మల్లికార్జున గౌడ్ (55) కొన్నేళ్లుగా స్థానిక తాలూకా ప్రాంగణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌గా ఉన్నాడు. ఇతడికి వివాహమైంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఇతని భార్య మృతిచెందింది. గత నెల నుంచి మల్లికార్జునకు ఆరోగ్యం బాగోలేదు. ఈ విషయాన్ని పిల్లలకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో సహచర రైటర్లు పూండ్ల జాన్సన్, చిన్న, పవన్ తదితరులు ఆయన ఆలనాపాలనా చూసుకున్నారు. కాగా ఆరోగ్యం క్షీణించి మల్లికార్జున సోమవారం చనిపోయాడు. ఈ విషయాన్ని తలకొరివి పెట్టాల్సిన కుమారుడికి చెప్పినా తండ్రి ఉన్నా లేనట్టేనని అన్నాడని రైటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారే అంత్యక్రియలు పూర్తి చేశారు.

అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొందాం



నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మనుబోలు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం

నెల్లూరు సిటీ: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయాయి. వాటిని ధైర్యం ఎదుర్కొందాం' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మనుబోలు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడకుండా, ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిద్దామన్నారు. రాష్ట్రంలో రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, తెలుగుదేశం శ్రేణులు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అన్యాయానికి పూనుకుంటున్న వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కూటమి నేతలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతుంటే, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రైతులను ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. కేసులకు, అరెస్టులకు, జైలుకు భయపడకుండా ధైర్యంగా ముందడుగు వేద్దామని చెప్పారు. పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా నిలుస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీని జిల్లాలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న కాలనీవాసులు

కోవూరు: శ్మశానానికి సంబంధించిన విషయమై సోమవారం కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబాకు కొందరు వినతిపత్రం అందజేశారు. అనంతరం నావూరు శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పలువురికి నందలగుంటలో స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణం ప్రారంభించిందన్నారు. కాలనీకి వెళ్లే మార్గంలో పంట కాలువ పక్కనున్న ఖాళీ స్థలంలో శ్మశానం కావాలని కొందరు అడిగారన్నారు. ఎక్కడైనా ఊరి చివరి స్థలం అడగడం సమంజసమన్నారు. ఊరు ప్రారంభంలో శ్మశానానికి స్థలం కావాలని కోరడం బాధాకరమన్నారు. ఇది 1,300 కుటుంబాలకు సంబంధించిన విషయన్నారు. పంట కాలువ పక్కన ఉన్న స్థలంలో బస్ షెల్టర్, పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి

- ఎంపీడీఓ నరసింహారావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పొదలకూరు : 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సామాజిక తనిఖీలకు అందరూ సహకరించాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 16వ విడత సోషల్ ఆడిట్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు జరిగిన గ్రామాల్లో 17 బృందాలు సోషల్ ఆడిట్ నిర్వహిస్తాయన్నారు. మొత్తం 30 పంచాయతీల్లో ఈజీఎస్, పీర్, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.17.10 కోట్లతో 1,492 పనులు చేపట్టినట్లు వివరించారు. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు పనులను ఆడిట్ చేస్తారన్నారు. గ్రామాల్లో ఆడిట్ పూర్తయిన తర్వాత మండల స్థాయిలో సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఆర్పీలు నీలకంఠం, ఆవులయ్య, 17 మంది డీఆర్పీలు, ఏపీఓ మధుసూదన్, టీఏలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలను వినియోగించుకోండి

- అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్



మాట్లాడుతున్న డాక్టర్ బాలసుబ్రమణియన్

ముత్తుకూరు: మత్స్య కళాశాలలో చదివే 4వ సంవత్సర బీఎఫ్ఎస్సీ విద్యార్థులు నిర్వహించే ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు సేవలను గ్రామస్తులను వినియోగించుకోవాలని అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ సూచించారు. మండలంలోని మల్లూరులో సోమవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) స్పెషల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. కళాశాల ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ మాధవన్ మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ప్రత్యేక క్యాంపుతో గ్రామానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. వైద్యాధికారి చందన, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య, డాక్టర్ కే మాధవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు.

సెన్సార్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు దయాకర్



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కొడవలూరు: ఆర్టీఏ కార్యాలయాల్లో సెన్సార్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ డిమాండ్ చేశారు. రవాణా రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చే సెన్సార్ ట్రాకింగ్ సిస్టం కప్పల దొరువులో మాత్రమే ఏర్పాటు చేసి జిల్లాలోని అన్నీ వాహనాలు అక్కడికే వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మారుమూల గ్రామాల్లోనూ ఆటోలు, స్కూల్ వ్యాన్‌లు ఉన్నాయన్నారు. వీరంతా కప్పల దొరువుకే వెళ్లడం వ్యయప్రయాసలతో కూడుకొన్న పని అన్నారు. అన్నీ ఆర్టీఏ కార్యాలయాల్లోనూ సెన్సార్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేస్తే వాహనదారులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. అదేవిధంగా రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సురేష్, టి.నరసింహం, ఆటో యూనియన్ నాయకులు సురేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ పరీక్షకు ఐదుగురు గైర్హాజరు

ముత్తుకూరు: పదో తరగతి పరీక్షలకు సంబంధించి నాలుగు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన మ్యాథ్స్ పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ మధుసూదన ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 684 మంది విద్యార్థులకు 679 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు.

పాపం వృద్ధురాలు

- పింఛన్ అందక ఇబ్బందులు



నాగేశ్వరమ్మ

బుచ్చిరెడ్డిపాళెం: ఆమె కేన్సర్‌తో బాధపడుతోంది. పింఛన్ ఇప్పించండి సారూ.. అంటూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. బుచ్చిరెడ్డిపాళెం మండలం చెల్లాయపాళెం గ్రామానికి చెందిన గంట నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు సోమవారం బుచ్చి తహసీల్దార్ కార్యాలయంతోపాటు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేసింది. నాగేశ్వరమ్మ భర్త మృతిచెందాడు. కన్నబిడ్డ పట్టించుకోవడం లేదు. ఆమెకు కేన్సర్ వచ్చింది. వేలిముద్రలు పనిచేయడం లేదని, ఐరిష్ పడటం లేదని ఆమెకు పింఛన్ రావడం లేదు. దీంతో ఆమె భిక్షాటన చేసి బతుకు జీవనం సాగిస్తున్నానని తెలిపింది. సమస్య పరిష్కరించి పింఛన్ ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతూ వేడుకుంటోంది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి కూడా తన గోడు చెప్పుకొన్నానని ఆయినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై ఎంపీడీఓ శ్రీహరి స్పందిస్తూ వృద్ధురాలికి ఆధార్ కార్డు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలి

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: విద్యార్థులు కేవలం అకడమిక్‌లోనే కాకుండా సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో సోమవారం జిల్లా స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంట్ 2025 కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉండాలని, విజ్ఞానం, నైపుణ్యాలు, నైతికతలను సమపాళ్లలో అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దేశ భవిష్యత్‌కు పునాదులని, దేశాభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను నిగ్గు తేల్చండి

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్



ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకరయ్యగౌడ్

తోటపల్లిగూడూరు: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలను నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని వరకవిపూడి పంచాయతీలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి భారీగా అవినీతి జరుగుతోందని, పది నెలల్లో జరిగిన పనులు, నిధులు, కూలీల వివరాలను ఆర్టీఏ చట్టం కింద అందించాలంటూ సోమవారం శంకరయ్యగౌడ్ ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ వరకవిపూడి పంచాయతీలో ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరగడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉపాధి హామీ పథకం ద్వారా జవాబుదారీ తనంతో కాలువలను పూడిక తీయించి రైతులకు మేలు చేశామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది దోచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. వరకవిపూడి పంచాయతీలో దాదాపు 90 మంది పనికి వెళ్లని మధ్య, ఉన్నత వర్గాలకు చెందిన వారి పేర్లను నమోదు చేసుకొంటూ నిధులను దిగమింగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేత మల్లి, తదితరులు పాల్గొన్నారు.

జీవనాధారం కూల్చేశారు

- ఆర్‌అండ్ అధికారుల దాష్టీకం
- అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి దుశ్చర్య
- 60 ఏళ్లుగా ఏసుదాసు అక్కడే జీవనం



సీపీఎం నాయకులతో కలిసి తోటపల్లిగూడూరు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు ఏసుదాసు

తోటపల్లిగూడూరు: రోడ్డు పక్కనే 60 ఏళ్లుగా చిన్న పూరి గుడిసె వేసుకుని టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న ఓ సామాన్యుడిపై ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతాపం చూపించి జీవనాధారాన్ని కూల్చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారుల ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. అధికారుల దాష్టీకానికి ఆ కుటుంబం రోడ్డున పడింది. వివరాల్లోకి వెళ్తే.. పేడూరు పంచాయతీ కృష్ణారెడ్డిపాళెంకు చెందిన దామవరపు ఏసుదాసు మండలంలోని కోవెరపాళెం క్రాస్ రోడ్డును ఆనుకుని పూరి గుడిసెను ఏర్పాటు చేసుకుని అందులోనే నివాసం ఉంటూ అక్కడే టిఫిన్ సెంటర్ నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారులు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా తొలగించారు. రోడ్డున పడిన తనకు న్యాయం చేయాలంటూ స్థానిక సీపీఎం నాయకులతో కలిసి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక అధికార పార్టీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు ఉన్న పళంగా సోమవారం వేకువ జామున పూరి గుడిసెను, జీవనాధారంగా ఉన్న టిఫిన్ సెంటర్‌ను ధ్వంసం చేశారన్నారు. కనీసం నోటీస్ కూడా ఇవ్వకుండా, తన వివరణను తీసుకోకుండా అనాదిగా జీవనాధారంగా ఉన్న స్థలాన్ని అన్యాయంగా లాక్కోవడం ఎంత వరకు సబబు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేసి భాధితుడు ఏసుదాసు కోరారు.

పాలనలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, నాయకులు, కార్యకర్తలు నిరసన

తోటపల్లిగూడూరు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ విమర్శించారు. ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో పాటు వందలాది హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం అధికారంలో వచ్చి పది నెలలు గడుస్తున్న ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతుల ధాన్యానికి సంబంధించి గిట్టుబాటు ధర అందక రైతులు లబోదిబోమంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.22 వేలు పలికిన పుట్టి ధాన్యం ఈ ఏడు రూ.16 వేలకు మించడం లేదన్నారు. మిల్లర్లు, దళారులు రైతులను దగా చేస్తుంటే ప్రభుత్వం రైతులను ఆదుకొనే విషయంలో మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలను అమలు చేయకుండా.. మరో వైపు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టని కూటమి ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దింపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా, సీపీఎం నేతలు బండి శౌరి, పచ్చా మధు, వేగూరు వెంకయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ, ఐనమాల కొండయ్య, మోచర్ల రాధయ్య, కందిపాటి రమణమ్మ, ఎస్‌కే ఆబ్బు, వీరయ్య, వెంకటయ్య, పరుశురామయ్య, ఆరణి గోపి తదితరులు పాల్గొన్నారు.